క్లుప్తంగా

చెక్కుల పంపిణీ

ఇల్లెందు: తెలంగాణలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంతో ఎంతోమంది పేదలు లబ్ధిపొందుతున్నారని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని సింగరేణి ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇల్లెందులో 179 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు రూ. 1.79 కోట్లు అందజేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, డీఎస్పీ ఎస్.చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ, ఎంపీడీఓ, తహసీల్దార్ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: స్థానిక పాత ఆర్డీఓ ఆఫీసు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రూ.83 లక్షల విలువగల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 83 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తహసీల్దార్ వివేక్, కొత్వాల శ్రీనివాసరావు, ఎస్కే సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం పాల్గొన్నారు.

‘అమ్మ’ ఆదర్శ పాఠశాల పనులు పూర్తి చేయాలి

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని టేకులపల్లి ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలో పర్యటించారు. మండల కేంద్రంలోని ఏ కాలనీతండాలో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్, బిల్లుడు తండా పంచాయతీ రామకృష్ణాపురం స్కూల్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, టీచర్లు కిరణ్, రమాదేవి, రామకోటేశ్వరి పాల్గొన్నారు.

సాగునీరు అందించండి..



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఇల్లెందు నియోజకవర్గానికి సాగు నీరు అందించిన తర్వాతనే ఇతర జిల్లాలకు తరలించాలని డిమాండ్ చేస్తూ ఇల్లెందు అఖిలపక్ష రాజకీయ పార్టీల నేతలు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం కొత్తగూడెంలోని ఆయన కార్యాలయంలో కలిశారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఏపూరి బ్రహ్మం, ఎస్‌ఏ నబీ, నూతలపాటి వెంకటేశ్వర్లు, రాంసింగ్ తదితరులు ఉన్నారు.


వైద్యసేవలపై నిర్లక్ష్యం వహించొద్దు



చిరుతానుపాడులో పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్

పాల్వంచరూరల్: వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్‌నాయక్ హెచ్చరించారు. మండల పరిధిలోని బంజర గ్రామపంచాయతీ చిరుతానిపాడు గ్రామం, ఉల్వనూరు పీహెచ్‌సీని శుక్రవారం ఆయన సందర్శించారు. చిరుతానిపాడులో దద్దుర్ల(అలర్జీ)తో అవస్థ పడుతున్న చిన్నారులను పరిశీలించి, సమస్య తగ్గుముఖం పట్టిందని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. వైద్యసిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని ఆదేశించారు.

పొంగుతున్న వాగులు..



ఉధృతంగా ప్రవహిస్తున్న పుణ్యపు వాగు

టేకులపల్లి: మండలంలో రెండు రోజులుగా వర్షం పడుతోంది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బొమ్మనపల్లి నుంచి చింతోనిచెలక మధ్యలో ఉన్న పుణ్యపువాగు వద్ద రాకపోకలకు అంతరాయం కలిగింది. టేకులపల్లి సెంటర్‌లో, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట వరద నీటితో నిండి చెరువులా తయారయింది. స్థానికులు ఇబ్బంది పడ్డారు.

చెరువులకు జలకళ

సుజాతనగర్: రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువులకు కలకళ సంతరించుకుంటోంది. ఇందులో భాగంగా జిల్లాలో ప్రసిద్ధిగాంచిన సింగభూపాలెం చెరువుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద చేరుకుంటోంది. కుడి కాల్వ నీటి సామర్థ్యం 22 అడుగులు కాగా ప్రస్తుతం 11 అడుగులకు చేరింది. ఎడమ కాల్వ నీటి సామర్థ్యం 14 అడుగులు కాగా ప్రస్తుతం 8 అడుగుల నీటి మట్టం ఉంది. దీంతో స్థానిక రైతులు, మత్స్యకారులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు.

ఎరువుల ధరలకు రెక్కలు

- కొరత భయంతో రైతులు అప్రమత్తం
- ఒక్కో బస్తా రూ.100కు పైగా ఎక్కువ ధరతో విక్రయాలు
- రైతుల అవసరాలే ఆసరాగా వ్యాపారుల దోపిడీ



మార్కెట్‌లో యూరియా నిల్వలు



ఇల్లెందురూరల్: ఈ సీజన్‌లో రైతులతో దోబూచులాడిన వరుణుడు ఎట్టకేలకు కరుణించాడు. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పంటలన్నీ కళకళలాడుతున్నాయి. ఈ దశలో మొక్కలు ఏపుగా ఎదిగేందుకు ఎరువులు అత్యవసరం. కానీ ఎరువులు కొనేందుకు వెళ్తున్న రైతులకు బహిరంగ మార్కెట్‌లో ధరలను చూస్తే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. చేసేది లేక వ్యాపారులు చెప్పిన ధరకు కొనుగోలు చేయక తప్పని పరిస్థితి అన్నదాతలకు ఎదురవుతోంది.

యూరియాకు డిమాండ్..

మండలంలో అత్యధిక విస్తీర్ణంలో మొక్కజొన్న పంటను సాగు చేశారు. గతేడాది కంటే 20 శాతం అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న సాగవుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో మొక్క ఏపుగా ఎదిగేందుకు యూరియా అవసరం. ఇదిలా ఉండగా జిల్లాలోని ఇతర మండలాలతో పోల్చుకుంటే ఇల్లెందు మండలంలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం అధికంగా ఉండటంతో యూరియా కేటాయింపు పెంచాలని, ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో యూరియా నిల్వలు సరిపడా లేవని, కేటాయింపు పెంచాలని వ్యాపారులు ఉన్నతాధికారులను కలిసి విన్నవించారు. అయితే అవసరం మేరకు యూరియా దొరుకుతుందో లేదోనన్న ఆందోళనకు గురైన రైతులు అత్యవసరం కావడంతో యూరియా కొనుగోలుపై దృష్టి సారించారు.

రూ.100 అదనపు ధరతో.. ప్రస్తుతం సొసైటీ ద్వారా ప్రభుత్వం ప్రకటించిన ఎంఆర్‌పీ ప్రకారం రూ.264కే యూరియా విక్రయాలు కొనసాగుతున్నాయి. అయితే ఏజెన్సీలో అత్యధిక సంఖ్యలో రైతులు వ్యాపారులు అందించే పెట్టుబడిపై ఆధారపడి సాగు చేస్తున్నారు. దీంతో అనివార్యంగా వారి వద్దే యూరియా కొనుగోళ్లు చేపడుతున్నారు. వీరితో పాటు పట్టాదారు పాస్‌పుస్తకాలు లేని గిరిజనేతర రైతులు కూడా బహిరంగ మార్కెట్‌లోనే యూరియా కొనుగోలు చేయక తప్పని పరిస్థితి. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు ఏకంగా ఎంఆర్‌పీ కంటే రూ.100కు మించిన ధరతో విక్రయాలు సాగిస్తున్నారు. తాను యూరియా బస్తాను రూ.380 వెచ్చించి కొనుగోలు చేశానని మండలంలోని కొమరారం ప్రాంతానికి చెందిన ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశా డు. వ్యాపారి వద్ద ఖాతా ఉన్నందున చెప్పిన ధరకు కొనుగోలు చేయక తప్పలేదని వాపోయాడు. ఇక డీఏపీ ఎంఆర్‌పీ రూ.1,250 ఉండగా బహిరంగ మార్కెట్‌లో రూ.1,350 నుంచి రూ.1,400 వరకు విక్రయిస్తున్నారని రైతులు బహిరంగంగానే చెపుతున్నారు. ఇక ఇతర ఎరువుల ధరలు కూడా ఎంఆర్‌పీ కంటే అదనంగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు.

నామమాత్రంగా తనిఖీలు..

నకిలీ విత్తనాలు, అధిక ధరలకు ఎరువుల విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా ప్రత్యేక బృందాలతో తనిఖీలు కూడా ప్రారంభించింది. విత్తన విక్రయాల సమయంలో విస్తృతంగా తనిఖీలు చేసిన అధికారులు ఆ తరువాత వాటి ఊసెత్తకపోవడంతో వ్యాపారులు ఎరువుల ధరలకు రెక్కలు తొడిగి విక్రయాలు చేపడుతున్నారు. అప్పుడప్పుడు తనిఖీల పేరుతో అధికారుల పర్యటనలు ఉంటున్నా అవి కేవలం మొక్కుబడిగా ఉంటున్నాయని బహిరంగ మార్కెట్‌లో రైతులకు ఎదురవుతున్న అధిక ధరలే ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఫిర్యాదులు అందితే చర్యలు..



బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు ఎరువులను ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతుల నుంచి లిఖిత పూర్వక ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందిస్తాం. క్రమం తప్పకుండా ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తూ ధరల పట్టికలు, నిల్వలను పరిశీలిస్తున్నాం. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.

– సతీష్, ఏఓ, ఇల్లెందు మండలం

అభివృద్ధిలో నా మార్క్ చూపిస్తా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ: నియోజవర్గ రూపురేఖలు మార్చడమే తన లక్ష్యం అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని అభ్యుదయ పాఠశాలకు రూ.27లక్షలతో మంజూరైన రెండు అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.1.12లక్షల చెక్కులు అందించారు. అనంతరం కరకవాగు నుండి గాజులగూడెంలో రూ.1.30 కోట్లతో మంజూరు అయిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. మాట్లాడుతూ... నియోజకవర్గంలో నా అభివృద్ధి మార్క్ చూపిస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి, తహసీల్దార్ వివేక్, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి శంకుస్థాపన..

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రపురం గ్రామపంచాయతీలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శుక్రవారం సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ మేరెడ్డి వసంత, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): నేతాజీ ప్రభుత్వ పాఠశాలకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వరాలు ప్రకటించారు. శుక్రవారం రామవరంలోని నేతాజీ ప్రభుత్వ పాఠశాలలో రూ.13.50 లక్షలతో నిర్మించనున్న సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల గురించి వివరాలు ఆరా తీశారు. అదనపు గదులు, ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. తనకు రామవరం అంటే ప్రత్యేక అభిమానమని, ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఎదగాలన్నారు. భూక్యా శ్రీనివాస్, కాపు సీతాలక్ష్మి, ఎస్కే సాబీర్‌పాషా, ఎంఇఓ జుంకీలాల్, మున్సిపల్ కమీషనర్ శేషాంజనేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవం ప్రారంభం



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కోరం, చైర్మన్ డీవీ, కమిషనర్ యాదగిరి తదితరులు

ఇల్లెందు: ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా అమలులో ఇల్లెందు అగ్రస్థానంలో ఉంటుందని, వన మహోత్సవంలో అగ్రస్థానంలో నిలిచేలా కృషి చేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలను ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. మున్సిపాల్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని చెరువుకట్ట వద్ద శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం 75వ వనమహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అన్న నానుడిని నిజం చేయాలన్నారు. నాటిన మొక్కలన్నీ బతికేలా సంరక్షణ బాధ్యతను అధికారులు, ప్రజాప్రతినిధులు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. పట్టణంలో ప్రతీ ఇంటికి ఐదు మొక్కలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆదర్శ మున్సిపాల్టీగా ఉన్న ఇల్లెందు పేరును సార్థకత చేసుకోవాలని కోరారు. విరివిగా మొక్కలు నాటి వన మహోత్సవంను విజయవంతం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బి.యాదగిరి, మేనేజర్ అంకుషావలీ, ఏఈ శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్, డీఈ నవీన్, ఏఈ కుమారస్వామి, శంకర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



నిల్వ నీటిని పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది

ఇల్లెందురూరల్: పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యవంతులుగా ఉంటారని రొంపేడు, కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కవిత, డాక్టర్ లోహిత సూచించారు. మండలంలోని విజయలక్ష్మీనగర్, నిజాంపేట గ్రామాలలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాలలోని పలు వీధులలో పర్యటించి నీరు నిల్వ కేంద్రాలను పరిశీలించారు. వాటిలో ఆయిల్ బాల్స్ చల్లి, నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఇంటి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరుబయట వృథాగా ఉన్న ఖాళీ పాత్రలలోకి నీరు చేరి దోమలకు ఆవాసాలుగా మారుతాయని చెప్పారు. గ్రామంలో జ్వరం వచ్చిన వారు స్థానికంగా ఉండే వైద్యసిబ్బందిని సంప్రదించాలని కోరారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది భద్రు, రాజు, లాల్‌సింగ్, సంత్రాలి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

జూలూరుపాడు: పడమటనర్సాపురం, పాపకొల్లు, జూలూరుపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సతీష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు అవార్డు

జూలూరుపాడు: పాపకొల్లుకు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకు రుద్రా స్టూడియో వారు మహానంది అవార్డు ప్రకటించారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు నిర్వాహకులు అవార్డు అందజేసి సన్మానించారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ



పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం ఎంపీపీఎస్ పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం కొల్లి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. చుంచుపల్లి సీఐ ఆర్.వెంకటేశ్వర్లు, తహసీల్దారు ప్రసాద్, హెచ్‌ఎం బాలాజీ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: వచ్చే నెల 9న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో జరిగే సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి రాథోడ్, జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం జూలూరుపాడులో విలేకరులతో మాట్లాడుతూ.. 10 శాతం గిరిజన రిజ్వరేషన్ పెంపు జీఓ నంబర్ 33కు చట్టబద్ధత కల్పించాలని, ఏజెన్సీ ప్రాంతంలో జీఓ నంబర్ 3 పునరుద్ధరించాలన్నారు. కొత్తగా ఏర్పడిన గిరిజన తండా గ్రామ పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలని కోరారు. సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన ధరావత్ సురేష్‌ను సన్మానించారు. అనంతరం రాష్ట్ర మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బానోత్ నవీన్, గుగులోత్ భద్రు, బానోత్ గణేష్, హరి, కిషన్, లక్ష్మణ్, రమేష్ పాల్గొన్నారు.

టెండర్లను తక్షణమే రద్దు చేయాలి



అభివాదం చేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన వారపు సంత, దినసరి మార్కెట్, కబేళాల టెండర్లు తక్షణమే రద్దు చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తాటిపల్లి రెసిడెన్సీ హాల్లో టీపీసీసీ సభ్యులు, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ జే.బాలశౌరి అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు మాట్లాడారు. ఐదేళ్ల మున్సిపాలిటీ పాలకవర్గం పనితీరుపై స్థానిక ఎమ్మెల్యే తక్షణమే సమీక్ష జరపాలని డిమాండ్ చేశారు. రూ.కోట్ల అవినీతి జరుగుతుంటే స్థానిక ఎమ్మెల్యే ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లలో అవినీతికి పాల్పడిన అధికారులు, ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసులు పెట్టాలని పేర్కొన్నారు. కొత్తగూడెంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై దశలవారీ ఆందోళనలకు సిద్ధమని అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు. పట్టణ అభివృద్ధి కోసం పలు తీర్మానాలను ఏకగ్రీవంగా చేశారు. కూసపాటి శ్రీనివాస్, యర్రా కామేష్, మొహమ్మద్ జలాల్, డి.వీరన్న, శ్రీధర్, వాసం రామకృష్ణ దొర, రాజేష్ నాయక్, కురిమిళ్ల శంకర్, ప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

జూలూరుపాడు: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ డిమాండ్ చేశారు. శుక్రవారం జూలూరుపాడులో జరిగిన ఏఐఎస్‌ఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రి లేకపోవడం బాధాకరమన్నారు. సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నట్లు చెప్పారు.

అదేవిధంగా పలు పోస్ట్ మెట్రిక్ హాస్టళ్ల వార్డెన్లు సమయపాలన పాటించడం లేదని, ఇన్‌చార్జి వార్డెన్ల స్థానంలో రెగ్యులర్ వార్డెన్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, సాయితేజ, రామ్‌చరణ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

శిథిల భవనాల పరిశీలన



బాధితులతో మాట్లాడుతున్న కమిషనర్

కొత్తగూడెంఅర్బన్: వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో శిథిలావస్థలో ఉన్న భవనాలను మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, భవనాలకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. ఆయా ఇళ్లల్లో నివసించేవారు ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ, టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రవి

టేకులపల్లి: కొత్తతండా(పి) గ్రామానికి చెందిన భూక్యా రవిరాథోడ్‌ను సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సేన ప్రణాళిక కమిటీ చైర్మన్, త్రిసభ్య కమిటీ సభ్యులు ధరావత్ ప్రేమ్‌చంద్ నాయక్ నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. టేకులపల్లిలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో నియామకపు పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని, రాష్ట్ర వ్యాప్తంగా లంబాడీ జాతి బిడ్డలు ఇంకా సాధించాల్సింది ఉందని, ప్రతీ బంజారా బిడ్డలు మన హక్కుల కోసం ఒక సైనికుడిగా పనిచేయాలన్నారు. బంజారా బిడ్డలకు మంత్రి పదవి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఏరియా ఆస్పత్రి కిటకిట



ఇన్‌పేషంట్లతో నిండిన వార్డు

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా ఆస్పత్రి తొలిసారి ఇన్‌పేషంట్ల సంఖ్య 100 దాటింది. ఆస్పత్రి ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు 800 వరకు ఓపీ వచ్చినా ఇన్‌పేషంట్లు మాత్రం 100 దాటిన దాఖలాలు లేవు. శుక్రవారం రోగులతో ఆస్పత్రి కిటకిట లాడింది. 60 మందికి పైగా జ్వరపీడితులే ఉన్నారు. అధికారులు రోగులకు తగ్గట్లు ఏర్పాట్లు చేపట్టారు. ఖాళీ గదుల్లో బెడ్లు ఏర్పాటు చేసి రోగులకు వైద్యం అందిస్తున్నారు.

100 పడకల ఆస్పత్రి అయినప్పటికీ ఇక్కడ 30 పడకలు మాత్రమే ఉన్నాయి. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసినప్పటికీ తగిన సదుపాయాలు కల్పించలేదు. 100 మంది ఇన్‌పేషంట్లు సంఖ్యను దాటిన సందర్భంగా డాక్టర్లను, నర్సులను, ఇతర విభాగాల సిబ్బందిని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జి.రవిబాబు, ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అభినందించారు.

వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కిన్నెరసాని ప్రాజెక్ట్‌ను పరిశీలించిన ఎస్పీ...

పాల్వంచరూరల్: భారీ వర్షాలు కురుస్తున్నందున కిన్నెరసాని నది పరివాహక ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షించాలని ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదేశించారు. కిన్నెరసాని ప్రాజెక్ట్ జలాయశాన్ని, రాజాపురం వద్ద లోలెవల్ చప్టాను శుక్రవారం ఎస్పీ సందర్శించారు. కిన్నెరసానికి భారీగా వరద నీరు చేరుతుండటంతో అక్కడ ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు.

కిన్నెరసాని గేట్లు ఎత్తే అవకాశం..

వానలు జోరుగా కురుస్తున్నందున వరదలు పెరిగితే ఏక్షణంలోనైనా కిన్నెరసాని ప్రాజెక్ట్ గేట్లు ఎత్తే అవకాశం ఉన్నందున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ.వినయ్‌కుమార్ కోరారు. కిన్నెరసాని, రాజాపురం గ్రామాల్లో శుక్రవారం ప్రజలకు వరదలపై అవగాహన కల్పించారు. విలువైన వస్తువులను భద్రపరుచుకోవాలని, ప్రాజెక్ట్ అధికారులకు, ప్రజలు, పంచాయతీ అధికారులు సహకరించాలన్నారు. అత్యవసరమైతే ప్రభుత్వం కిన్నెరసానిలో ఏర్పాటు చేసే పునరావసం కేంద్రానికి తరలివెళ్లెందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని చెప్పారు.

ఇల్లెందు: వరద పెరుగుతుండడంతో పలు వాగులను డీఎస్పీ చంద్రభాను శుక్రవారం పరిశీలించారు. శుక్రవారం ఇల్లెందు – నామాలపాడు మధ్య బయ్యారం అలుగు వాగు ఉధృతిని సందర్శించి పరిశీలించారు. వర్షాలు అధికం అయినప్పుడు ఈ వాగు పొంగి ప్రవహిస్తుందని, అలాంటప్పుడు అత్యుసతరం పేరిట ప్రజలు వాగు దాటే ప్రయత్నం చేస్తుంటారని, ప్రమాధాలు జరుగుతుంటాయని తెలిపారు. ఇల్లెందు – బయ్యారం మధ్య నామాలపాడు వాగు పొంగితే ట్రాఫిక్ మళ్లిస్తామని తెలిపారు. ఖమ్మం మీదుగా వెళ్లేలా ప్రయత్నం చేస్తామని ప్రజలెవరూ వాగు దాటరాదని తెలిపారు. వాగును సందర్శించిన వారిలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ధన్‌సింగ్, సీఐ బత్తుల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



పాల్వంచరూరల్: కిన్నెరసాని ప్రాజెక్టు పైనుంచి జలాశయాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కాచనపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో..

అధికంగా వర్షాలు కురుస్తే వాగులు, అలుగులు పొంగే ప్రమాదం ఉందని రోడ్ల మీదుగా ప్రవహించే వాగులు దాటి ప్రమాదాలు బారిన పడొద్దని పోలీసులు ప్రచారం చేపట్టారు. ఇల్లెందు, కాచనపల్లి పోలీసులు స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ఆటోకు మైక్ ఏర్పాటు చేసి స్వయంగా పోలీసులే ఊరూరా ప్రచారం చేశారు.

ఇల్లెందురూరల్: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొమరారం ఎస్సై సోమేశ్వర్ విజ్ఞప్తి చేశారు. మండలంలో రహదారులపై నీటి ప్రవాహానికి అవకాశం ఉన్న ప్రాంతాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఆయా చోట్ల హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. మాట్లాడుతూ.. చెరువు అలుగులకు సమీపంలో, వంతెనలపై రాత్రివేళలో ప్రయాణించాల్సి వచ్చినప్పుడు నీటి ప్రవాహ ఉధృతిని గమనించాలన్నారు. ప్రజలు అత్యవసర సేవలు అవసరమైనప్పుడు పోలీసుశాఖ సహకారం తీసుకోవాలని కోరారు.

జూలూరుపాడు: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జూలూరుపాడు ఎస్ఐ బి.రాణాప్రతాప్ కోరారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ.. రాబోవు మూడు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొనడంతో చెరువులు, కుంటలు తెగిపోయే అవకాశం ఉందని, అదేవిధంగా వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించే ప్రమాదం ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు, పశువులు, మేకల కాపరులు, చేపల వేటకు వెళ్లే వారికి వర్ష సూచన, విద్యుత్, చెరువు కట్టలు తెగే ప్రమాదాలు, పిడుగుల పట్ల సరైన అవగాహన కల్పించాలని ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లకు సూచించారు.



ఇల్లెందురూరల్: పోలారం పెద్దచెరువు అలుగు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సోమేశ్వర్



ఇల్లెందు: నామాలపాడు బయ్యారం అలుగు వాగును పరిశీలిస్తున్న అధికారులు



పాల్వంచరూరల్: కిన్నెరసాని గ్రామంలో మాట్లాడుతున్న సీఐ వినయ్‌కుమార్